## కథ

నామని సుజనాదేవి

# కొడుకు నేర్పిన పాఠం

పల్లెటూర్లో పొలం పనులకు చీకటితో నాలుగ్గంటలకే లేవటం అలవాటు రాఘవయ్యకి. అందుకే టౌన్‌లో పనుండి, నిన్న కొడుకు వాళ్లింటికి వచ్చినా అలవాటు ప్రకారం మళ్లీ అదే నాలుగ్గంటలకే లేచాడు. అతను లేచిన అరగంటకి కొడుకు బెడ్‌రూంలో అలారం మోగింది. కోడలు తలుపు తీసుకుని బయటకు వచ్చింది. బాత్రూంలో కెళ్లి ముఖం కడుక్కుని వచ్చి ముందున్న డ్రెస్సింగ్ రూంలో లైట్ వేసుకుంది.

ఈ కాలం పిల్లలు బారెడు పొద్దెక్కితేగానీ లేవరు. అత్తగారింట్లో ఉన్నపుడు కూడా ఎప్పుడూ ఇంత ప్రొద్దుటే లేవ లేదు కోడలు విశాల. మరి ఇంత పొద్దుటే లేచి, చేసే పనే ముందని కుతూహలంతో హాల్లోకి వచ్చాడు. అక్కడ నుండి చూస్తే కోడలు కుర్చీలో కూర్చుని, టేబుల్‌పై పుస్తకం పెట్టుకుని చదివేది కనబడుతోంది. ఉద్యోగం కూడా వచ్చాక ఇంత ప్రొద్దుటే లేచి చదివే చదువేంటబ్బా అనుకున్నాడు రాఘవయ్య.

ఆరు గంటలకు కొడుకు రమణ లేచి, నెమ్మదిగా తన పనులు చేసుకుని ఇంటి పనులు చేయడం మొదలుపెట్టాడు. కోడలు ఇంటి ముందు కడిగి ముగ్గులేస్తే, ఇల్లంతా ఊడ్చుకొచ్చాడు. బాబుకి స్నానం చేయించి, టిఫిన్ తినిపించి, తల దువ్వి, పౌడర్ వేసి, స్కూల్ యూనిఫామ్ వేసి తయారుచేశాడు. స్నానం చేయించేంతసేపు తన చిట్టిపొట్టి మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడుతున్న కొడుకు మాటలను మురిపెంగా ఆస్వాదిస్తూ, వాడి యక్షప్రశ్నలకు సమాధానాలిస్తూ పని పూర్తి చేశాడు. తర్వాత చట్నీకి, విశాల పల్లీలు ఇస్తే మిక్సీ చేసి ఇచ్చాడు. కూరగాయలు కూనిరాగాలు తీస్తూ తరిగి ఇచ్చాడు. పని చేస్తున్నంత సేపు భార్యాభర్తలు నవ్వుతూ, సరదాగా మాట్లాడుతూ, మధ్యమధ్యలో రాఘవయ్యతో మాట్లాడుతూ పనులు పూర్తిచేశారు. అంతా చూస్తున్న రాఘవయ్యకి కోపం తన్నుకొస్తుంది. వీడు రోజురోజుకీ భార్యా విధేయుడు అయి బానిసలా మారిపోతున్నాడేమిటి? అన్నీ ఆడంగి పనులు చేస్తున్నాడు. మరీ ఇలా ప్రవర్తిస్తే, వారు మన మాటెలా వింటారు. ఇలా కాదు. వీడికి బుద్ధి చెప్పాలి. అదీ కోడలి ముందు బాగోదు అనుకున్నాడు.

“నాన్నా... టిఫిన్ రెడీ... స్నానానికి నీళ్లు తోడాను రండి” అంటూ రమణ పిలవటంతో లోనికెళ్లాడు రాఘవయ్య.

“మామయ్య... ఇదిగోండి టవల్” అంటూ అందించింది విశాల.

టిఫిన్ తినగానే “ఇంకా టౌన్లో పని పూర్తి కాలేదురా. చూసుకుని అటునుండటే ఇంటికెళ్లిపోతానురా” అన్నాడు రాఘవయ్య.

“అదేంటి మామయ్య... పని పూర్తయ్యాక ఇటే రండి. అంతగా అయితే రేపు వెళుదురుగానీ... అక్కడ అత్తయ్య ఎదురుచూస్తుందేమో” అంది విశాల.

“తాతయ్య... నేను స్కూల్ నుండి రాగానే నాకు కథ చెబుతానన్నావు” ఫిర్యాదుగా అన్నాడు మనవడు సాయిరాం.

“సాయంత్రం దగ్గర్లోని గుడికి వెళదాం, రండి నాన్న” అన్నాడు రమణ.

“సరే... అయితే పనయ్యాక... నా స్నేహితుడు శివయ్య దగ్గరకెళ్లి సాయంత్రం వస్తాను. భోజనం అక్కడే చేస్తాను” అన్నాడు రాఘవయ్య.

వెంటనే భర్తకి, బాబుకి, తనకి క్యారేజీలు సర్దేసింది విశాల. అంతా బయటకు నడిచారు.

సాయంత్రం విశాల ఇంటికి రాగానే స్నానం చేసి, దీపం వెలిగించి వేడి వేడి పకోడీ వేసేసరికి, అంతా వచ్చేశారు. అవి తిన్నాక, “నాన్నా, మీరు, నేను, బాబుతో కలిసి గుడికెళ్దాం రండి” అంటూ బయల్దేరదీశాడు రమణ.

“అదేం విశాల రాదా” అన్నాడు రాఘవయ్య.

“లేదు నాన్నా... తనకి పరీక్ష ఉంది. డిపార్ట్‌మెంటల్ టెస్ట్. పైగా తనకి ఒంట్లో బాలేదు” అంటూ బయటకు నడిచాడు రమణ.

అంతా గుడికెళ్లి, వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని, ప్రశాంతంగా కోనేటి గట్టున కూర్చున్నాడు. బాబు అటు, ఇటు తిరుగుతూ ఆడుకుంటుంటే, మురిపెంగా చూస్తూ గమనిస్తున్నాడు రమణ. రమణ ముఖంలోని ఆనందాన్ని వింతగా చూస్తున్నాడు రాఘవయ్య.

మెట్లెక్కేపుడు వన్, టు, త్రీ అంటూ కొడుకుతో అంకెలు చెప్పిస్తూ, ఆటలాడుకుంటూ ఎక్కినట్లే ఎక్కాడు రమణ. గుళ్లో ‘శుక్లాంబరధరం’, ‘సరస్వతీ నమస్తుభ్యం’ శ్లోకాలు, ‘హరేరామ హరేరామ’ భజనలు తాను పాడుతూ, కొడుకుచేత పాడించాడు. ముద్దు ముద్దు మాటలతో స్వంతంగా బాబే శ్లోకాలు చెప్పాడు. అక్కడ గోడలపై ఉన్న పురాణాలలోని బొమ్మలను చూపిస్తూ, వాటి వెనుకనున్న కథలను హావభావాలతో, కొడుకు ప్రశ్నలకు సమాధానాలిస్తూ, రమణ చెబుతుంటే అబ్బురంగా చూస్తూ, ఆసక్తిగా విన్నాడు బాబు. వాళ్లిద్దరినీ అలా చూస్తుంటే ఎందుకో అపురూపంగా అనిపించింది రాఘవయ్యకు. తనకు ఐదుగురు సంతానమున్నా, తానెప్పుడూ ఎవరితో ఇంత సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకోలేదు. ఇక్కడ సాయిరాం తండ్రి భుజాలపై ఎక్కడం, చల్‌చల్‌గుర్రం అంటూ తండ్రి వీపుపై ఎక్కడం ఇదంతా కొత్తగా అనిపిస్తుందతనికి. తన పిల్లలు, తను వస్తున్నాడంటేనే భయంతో పారిపోయి తలుపు చాటున, అమ్మ కొంగు చాటున నక్కడం మాత్రమే తెలుసు. కోడలు విశాల కూడా ఇది ఆడపనా, మగపనా అని చూడకుండా మనవడి పనులు కూడా కొడుకుతో చేయించడం. జీర్ణించుకుపోయాడు. అందుకే కొడుకుతో మాట్లాడటానికి ఇది సరైన సమయం అనుకుని నెమ్మదిగా “రమణా.. ఏంట్రా.. ఆ ఆడంగిపనులు ఇంట్లో. మగాడు అంటే మగసిరి ఉట్టిపడేలా సింహంలా ఉండాలిరా. కోడలికి అంత చనువివ్వడం బాలేదు. పైగా తానేమో కుర్చీలో కూర్చుని మగరాయుడిలా చదువుతుంటే, నువ్వేమో ఆడంగివెధవలా వంటింటి పనులు చేస్తావా... నేనెప్పుడైనా అలా చేశానా? నేను వస్తున్నానంటే చాలు ఇంట్లోవాళ్లందరూ కనబడకుండా భయం భయంగా తలుపులచాటున దాక్కునేవాళ్లు. ఇంట్లో వారి వరికెందుకు. నేనొస్తున్నానంటే చాలు. నా బండి చప్పుడయ్యిందంటే ఆకతాయిలు, ఆటలాడే పిల్లలంతా తలో మూల పరుగెత్తి ‘గప్‌చుప్’ అయిపోయేవాళ్లు. సాయికి కూడా తండ్రంటే భయమే లేదు.. నువ్వేంట్రా ఇంతలా మారిపోయావ్...” అన్నాడు.


“నాన్న... విశాలకి డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఉంది. రోజంతా ఆఫీసుండే సరికి, ఆమెకు చదువుకోవడానికి తీరిక ఉండటం లేదు. అందుకే తను చదువుకుంటుంటే నేను కొన్ని పనులు సహాయం చేస్తున్నాను. ఇందులో ఆడ మగ పనులు అనుకోవడానికేముంది. ఆమె కూడా ఆఫీసుకెళ్లి, నాతో సమానంగా సంపాదిస్తుంటే, ఇంటి కొచ్చాక పనుల్లో భాగం పంచుకోవడం తప్పా..... ఇద్దరం చెరో పని చేస్తే పని తొందరగా అవుతుంది. దొరికిన సమయం ఇద్దరం ఎంజాయ్ చేస్తాం. ఇక సాయి గురించంటారా... వాడిది పసివయసు. వాడు తప్పు చేస్తే తప్పని బెదిరించి, నచ్చజెబుతాం. గుప్పిట మూసినంత వరకే భయం ఉంటుంది. అది తెరిచి దెబ్బ వేస్తే, రాటుదేలి భయం పోతుంది. ప్రేమగా ఏ విషయం చెప్పినా పిల్లలు త్వరగా అర్థం చేసుకుంటారు... ఆ.. అన్నట్లు చీకటి పడింది. తెల్లవారితే విశాల బర్త్‌డే... ఆమెకి చెప్పకుండా సర్‌ప్రైజ్ చేయాలని చీర తీసుకున్నాను. దారిలో లేడీస్ టైలర్ దగ్గర ఆగి బ్లౌజ్ తీసుకువెళ్లాలి... త్వరగా వెళ్దాం పదండి...”


అంటూ బయల్దేరదీశాడు రమణ.

తెల్లవారి విశాల లేచి గుమ్మంలోకి రాగానే, బెలూన్ నుండి పూలు ఆమెపై పడేట్లు చేసి, తప్పట్లు కొడుతూ "హేపీ బర్త్‌డే...." అంటూ రమణ, సాయి పాడేసరికి, ఆమ ఆశ్చర్యపోతూ, "పరీక్షల హడావుడిలో నా బర్త్‌డే నేనే మరిచిపోయాను" అంది.

భర్త కొత్త చీర తెచ్చిస్తే "అబ్బా ఎందుకివన్నీ... మీరు ఉంటే చాలు" అంటూ భర్తను ప్రేమగా చూస్తూ కాళ్లు మొక్కడం రాఘవయ్య దృష్టిని దాటిపోలేదు. పూజ చేసి, గుడికెళ్లి వచ్చాక, స్వీట్లు భర్తకు, రాఘవయ్యకు ఇచ్చి, అక్షింతలు కూడా చేతికిచ్చి, కాళ్లు మొక్కి ఆశీస్సులు తీసుకుంది. ఆ రోజు జాలీగా గడపాలి.... అంటూ రమణ హోటల్ నుండి వెజ్ మంచూరియా, ఐస్‌క్రీం తెస్తే, విశాల ఇంట్లో బిర్యాని, ఆలూ కూర్మాలాంటి స్పెషల్స్ చేసింది. వారి ఆనందం ఎందుకో సంతోషాన్నిచ్చింది రాఘవయ్యకు. తన జీవితంలో ఆరుపదులు దాటుతున్నా ఇలాంటి ఒక్క సంఘటనా జ్ఞాపకం రాలేదు. అసలు ఏనాడయినా తాను అలా మెదిలితే కదా... కనీసం తన స్వహస్తాలతో చీరయినా ఇన్ని సంవత్సరాల దాంపత్య జీవితంలో కొనివ్వలేదు. చీర కావాలని భార్య భయం భయంగా నసుగుతూ అడిగితే, ఏదో దానం పారేసినట్లు డబ్బు ఇవ్వటమేగానీ, ప్రేమగా తానేనాడు చీర కొనివ్వలేదు.

పైగా పెళ్లయిన కొత్తలో ఒకసారి "ఏమండీ, ఈరోజు మన పెళ్లి రోజు, రాత్రికి మల్లెపూలు తీసుకురారూ" అంటూ అడగగానే, మన "నేనెలా కనబడుతున్నాను. మగాడ్ని నన్ను పూలు తెమ్మంటావా? ఇంకా నయం కొప్పులో పెట్టమన్నావు కాదు... అవన్నీ భోగంవాళ్ల సరదాలు" అంటూ ఈసడించుకున్నాడు. సిగ్గుతో చితికిపోయిన భార్యను చూస్తూ మళ్లీ ఏనాడూ నోరు తెరిచి ఏమీ అడగలేదు తులసి. తానూ కొనివ్వలేదు. ఐదుగురు పిల్లల పెళ్లిళ్లు చేసినా ఇంకా తనంటే ఆమెకు భయమే. అది గర్వంగా అనుకుంటాడు. కానీ ఇప్పుడనిపిస్తుంది. నిజంగా తాను ఎన్ని మంచి మధుర జ్ఞాపకాలను పోగొట్టుకున్నాడు. జీవిత చరమాంకంలోకి ప్రవేశించారు. ఆమెకి తాను, తనకి ఆమె తప్ప ఎవరుంటారు తోడు. పాపం పెళ్లయిన దగ్గర్నుంచి ఊడిగం చేయడానికి తప్ప దేనికీ నోచుకోలేదామె. ఇలా అనుకున్నదే తడవుగా కొడుకు, కోడలు ఎంత ఉండమని బ్రతిమిలాడినా, వెళ్లాలంటూ ఆగకుండా టౌన్‌కెళ్లి పట్టుచీర, గాజులు, పూలు కొనుక్కుని ఇంటికెళ్లాడు.





తలుపు తెరిచి రాఘవయ్యను చూడగానే కాళ్లకు నీళ్లివ్వడానికి వెనుదిరుగుతూ కోడలు, కొడుకు, మనవడు బావున్నారా అంటూ వెళుతుంటే కొంగు ఎక్కడో చిక్కుకున్నట్టనిపించి వెనుదిరిగింది తులసమ్మ. భర్త చేతిలో ఉన్న తన కొంగును చూస్తూ, అయోమయంతో అలాగే నిల్చుండిపోయింది. ఆమెను అలాగే లాక్కుని గుండెలకి పొదవుకుంటూ, చేతిలోని సంచీని ఆమెకందించాడు. అందులోని చీరను, గాజులను, పూలను చూసి నివ్వెరపోయింది. కలా, నిజమా తెలియనట్లు బిత్తరపోయింది. తపస్సు చేయకుండానే దేవుడు ప్రత్యక్షమై వరమిచ్చినట్లు ఉంది ఆమె పరిస్థితి. అసలు సింహం లాంటి మనిషి పగటిపూట రాగానే ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవటం ఒక వింతయితే, ఏనాడూ పట్టుమని రూపాయి పూలు కూడా తేని మనిషి ఇలా ఒకేసారి పెద్ద పెద్ద వరాలు తేవటం ఒక వింత. ఆశ్చర్యం నుండి తేరుకుంటూ, "మీరు... మీరేనా..?" అంది ఒకింత అనుమానంగా.

"అచ్చంగా... నీ మొగుణ్నే. ఇన్ని రోజులు నిన్ను చాలా కష్టపెట్టాను. నన్ను క్షమించు తులసీ" అంటున్న అతన్ని, కళ్లలో ఆనందభాష్పాలు రాలుతుండగా తన చేతులతో అతని పెదవులను మూస్తూ మరింత హత్తుకుపోయింది తులసమ్మ.

తనకు బుద్ధి వచ్చేలా చేసిన కొడుకుకు కృతజ్ఞతలు మనసులోనే రాఘవయ్య చెప్పుకుంటుంటే, అదంతా తన లీలేనన్నట్లు దేవుడి గది తలుపుకున్న చిరుగంటలు మృదుమధురంగా మ్రోగాయి.

○